ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా వైఎస్సార్‌



పంజాగుట్టలో అంజన్‌కుమార్‌యాదవ్‌తో కలిసి వైఎస్సార్‌ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్‌ నాయకులు

మల్లాపూర్‌: దివంగత సీఎం డాక్టర్‌ వైఎస్‌.రాజశేఖర్‌రెడ్డి, కుల, మత రాజకీయాలకు అతీతంగా అందించిన సంక్షేమ పాలనతో తెలుగు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని చర్లపల్లి డివిజన్‌ కార్పొరేటర్‌ బొంతు శ్రీదేవి అన్నారు. నాచారం చౌరస్తాలో సోమవారం టీపీసీసీ లేబర్‌ సెల్‌ వైస్‌ చైర్మన్‌ పీఎస్‌. ప్రకాష్‌ ఆధ్వర్యంలో మహానేత జయంతిని ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్‌ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదేవిధంగా మొసలి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో పత్తికుమార్‌, సీతారాంరెడ్డి, కృష్ణారెడ్డి, శ్రీకాంత్‌గౌడ్‌, సంతోష్‌రెడ్డి, రాంరెడ్డి, బాలరాజ్‌, సాయిబాబా పాల్గొన్నారు.

గౌతంనగర్‌: వైఎస్‌.రాజశేఖర్‌రెడ్డి జయంతి సందర్భంగా పంజాగుట్టలోని ఆయన విగ్రహానికి గౌతంనగర్‌కు చెందిన పలువురు నాయకులు మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్‌తో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. అదేవిధంగా వైఎస్సార్‌సీపీ నాయకులు తడక జగదీశ్వర్‌ గుప్తా ఆధ్వర్యంలో నేరేడ్‌మెట్‌ రామకృష్ణపురంలో ఘనంగా నిర్వహించారు. ఆనంద్‌బాగ్‌ కాంగ్రెస్‌ కార్యాలయంలో కాంగ్రెస్‌ పార్టీ బీ బ్లాక్‌ అధ్యక్షుడు వెంకటేష్‌యాదవ్‌ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు.



నాచారం చౌరస్తాలో పూలమాలు వేసి నివాళులర్పిస్తున్న కార్పొరేటర్‌ శ్రీదేవి



ఆనంద్‌బాగ్‌ కాంగ్రెస్‌ పార్టీ కార్యాలయంలో వైఎస్సార్‌ జయంతిలో పాల్గొన్న కార్యకర్తలు



రామకృష్ణపురంలో నిర్వహించిన జయంతిలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు

స్పెషల్‌ ఆఫీసర్ల పాలన షురూ ..!

అధికారుల నియామకం

- 15 మండలాల్లో అభివృద్ధి కార్యక్రమాల పర్యవేక్షణే లక్ష్యం
- వారానికి రెండు రోజులు స్థానిక సంస్థల్లో పర్యటనలు
- ప్రభుత్వ పథకాల అమలు, ఉద్యోగుల పని తీరు తదితర అంశాలపై నివేదికలు ఇవ్వాలని ఆదేశం



సాక్షి,సిటీబ్యూరో: మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాలు,సంక్షేమ పథకాలను అర్హులైన ప్రజల దరికి చేర్చడంతో పాటు ప్రభుత్వ ప్రాధాన్యతలకు అనుగుణంగా ,వాటి అమలు తీరును మండలాల్లో పర్యవేక్షించేందుకు స్పెషల్‌ ఆఫీసర్లను నియమిస్తూ.. కలెక్టర్‌ గౌతమ్‌ సోమవారం ఆదేశాలు జారీ చేశారు. అభివృద్ధి పనులు , పథకాలను ప్రజల దరికి చేర్చేందుకు ఏలాంటి నిర్లక్ష్యం, అలసత్వాన్ని పాటించకుండా సంబంధిత ఉద్యోగుల పని తీరును మెరుగు పరిచే లక్ష్యంలో భాగంగా మండలాల్లో వారంలో ప్రతి మంగళ, శుక్రవారాల్లో స్పెషల్‌ ఆఫీసర్లు పర్యటించి.. ఏమైనా ఫిర్యాదులు,అభివృద్ధి పనులు, పథకాల్లో నెలకొన్న లోపాలపై ఎప్పటికప్పుడు జిల్లా కలెక్టర్‌కు నివేదికలు అందజేయాల్సి ఉంటుంది. ఈ నివేదికల ఆధారంగా సంబంధిత శాఖల ఉద్యోగులపై చట్టపరమైన క్రమశిక్షణ చర్యలకు జిల్లా అధికార యంత్రాంగం చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

స్పెషల్‌ ఆఫీసర్ల పర్యవేక్షణ ఇలా..

మండలాలకు నియమితులైన స్పెషల్‌ ఆఫీసర్లు ప్రతి మంగళ,శుక్ర వారాల్లో వారికి కేటాయించిన మండలాల పరిధిలో పర్యటించాల్సి ఉంటుంది. వీరు ప్రధానంగా అంగన్‌వాడీ కేంద్రాలు , గురుకులాలు, హాస్టళ్లు, ప్రభుత్వ విద్యాసంస్థలు, చిన్న పిల్లల హోమ్స్‌ , మొక్కల పెంపకం తదితర వాటితోపాటు ప్రభుత్వ ప్రాధాన్యతలకు సంబంధించిన విషయాలపై దృష్టి పెట్టాల్సి ఉంది. వారు పరిశీలించిన అభివృద్ధి పనులు ,సంక్షేమ పథకాల అమలు తీరులో కనిపించిన లోపాలు ,ఉద్యోగులు నిర్లక్ష్యం,అలసత్వం వంటి విషయాలతో పాటు ప్రగతి తదితర అంశాలను పరిశీలించి ..నివేదిక రూపంలో కలెక్టర్‌కు సమర్పించాల్సి ఉంటోంది. చర్యలు లేదా ప్రశంసలకు సంబంధించిన సిఫారసులను కూడా స్పెషల్‌ ఆఫీసర్‌ చేసేందుకు అవకాశముంది. దీనికి అనుగుణంగా కలెక్టర్‌ చర్యలకు ఉపక్రమించనున్నారు.

స్పెషల్‌ ఆఫీసర్లు వీరే..

మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లాల్లో 15 మండలాలు ఉండగా, మండలానికి ఒక జిల్లా స్థాయి అధికారిని స్పెషల్‌ ఆఫీసర్‌గా కలెక్టర్‌ గౌతమ్‌ నియమించారు. శామీర్‌పేట మండలానికి స్పెషల్‌ ఆఫీసర్‌గా జిల్లా స్పెషల్‌ డిప్యూటీ కలెక్టర్‌ హోదాలో భూసేకరణ(ప్రరిశ్రమల శాఖ) అధికారి పి.సైదులును నియమించారు. మూడుచింతలపల్లి మండలానికి జెడ్పీ డిప్యూటీ సీఈఓ బి.నీరజ, కీసర మండలానికి జిల్లా మత్స్యశాఖ అధికారి పూర్ణిమ, ఘట్కేసర్‌ మండలానికి డీఆర్‌డీఏ పీడీ సాంబశివరావు , మేడ్చల్‌ మండలానికి జడ్పీ సీఈఓ దిలీప్‌కుమార్‌, మేడిపల్లి మండలానికి బీసీ వెల్ఫేర్‌ జిల్లా అధికారి కేశురామ్‌, కాప్రా మండలానికి మహిళా ,శిశు ,వృద్ధుల సంక్షేమ శాఖ జిల్లా అధికారి కృష్ణారెడ్డిని స్పెషల్‌ ఆఫీసర్‌గా నియమించారు. మల్కాజిగిరి మండలానికి మల్కాజిగిరి ఆర్డీఓ శ్యామ్‌ ప్రకాష్‌, అల్వాల్‌ మండలానికి జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి కె.వీణ, గండిమైసమ్మ దుండిగల్‌ మండలానికి ఎస్సీ కార్పొరేషన్‌ ఈడీ డి.బాలాజీ, కుత్బుల్లాపూర్‌ మండలానికి జిల్లా అడిట్‌ అధికారి కె.వెంకటేశం, బాచుపల్లి మండలానికి జిల్లా కోఆపరేటివ్‌ అధికారి కె.రాజేందర్‌రెడ్డి, బాలానగర్‌ మండలానికి ఎస్సీ అభివృద్ధి శాఖ జిల్లా అధికారి జి.వినోద్‌కుమార్‌, కూకట్‌పల్లి మండలానికి జిల్లా పరిశ్రమల శాఖ జీఎం పడాల రవీందర్‌, ఉప్పల్‌ మండలానికి ఏసీఎల్‌ ఎం.యాదయ్యను స్పెషల్‌ ఆఫీసర్‌గా నియమించారు.

నిత్యావసర సరుకులు పంపిణీ



నిత్యావసర సరుకులు అందజేస్తున్న ప్రతినిధులు

మల్కాజిగిరి: అలయి నాన్‌గారి కేఎం రాకేష్‌ జ్ఞాపకార్థం మల్కాజిగిరి విష్ణుపురి కాలనీలో అసోసియేషన్‌ ఆఫ్‌ అలియన్స్‌ క్లబ్‌ ఇంటర్నేషనల్‌ డిస్ట్రిక్‌ 200 ఎస్‌ హైదరాబాద్‌ ఆధ్వర్యంలో సోమవారం పేదలకు వస్త్రాలు, నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమానికి ఇంటర్నేషనల్‌ అధ్యక్షుడు అలయిబ బాల చంద్రన్‌ హాజరయ్యారు. కార్యక్రమంలో క్లబ్‌ ప్రతినిధులు మధుసూదన్‌, అంజయ్య, రాధాకృష్ణ, విజయ్‌పటేల్‌ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్‌ పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు నోటు పుస్తకాలు, స్టేషనరీ సామగ్రిని అందజేస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

కుషాయిగూడ: మీర్‌పేట్‌–హెచ్‌బీకాలనీ డివిజన్‌, శ్రీ షిరిడీ సాయి బాబా సంస్థాన్‌ ట్రస్టు ఆధ్వర్యంలో శ్రీ శేషసాయి కెమికల్స్‌ సహకారంతో సోమవారం మల్లాపూర్‌ జడ్పీహెచ్‌ఎస్‌ విద్యార్థులకు నోట్‌ పుస్తకాలు, స్టేషనరీ సామగ్రిని అందజేశారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే పేద విద్యార్థులకు తమవంతు సహకారం అందజేస్తున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు నాదంచారి, ప్రధాన కార్యదర్శి రాజారావు, కోశాధికారి వీరభద్రరావు, ఉపాధ్యక్షుడు రమణ, సత్యనారాయణ, నాగయ్య, సురేష్‌, హెచ్‌ఎం పద్మారావు, గౌరయ్య తదితరులు పాల్గొన్నారు.

మల్కాజిగిరి అభివృద్ధికి సేవకుడిగా పనిచేస్తా

- కంచె చేను మేస్తోందన్నట్లు కాంగ్రెస్‌ ప్రభుత్వం
- ఎంపీ ఈటల రాజేందర్‌



ఎంపీ ఈటల రాజేందర్‌ని సత్కరిస్తున్న నాయకులు, కుల సంఘాల నాయకులు

గౌతంనగర్‌: మల్కాజిగిరి సమస్యలను కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని, ప్రజలకు సేవకుడిగా పని చేస్తానని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌ అన్నారు. గౌతంనగర్‌ డివిజన్‌ లక్ష్మీసాయి గార్డెన్స్‌లో సోమవారం ఏర్పాటు చేసిన కృతజ్ఞత సభలో బీజేపీ నాయకులు, వివిధ కుల సంఘాల నాయకులు ఎంపీని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మల్కాజిగిరిలో వరద ముంపు సమస్యతో పాటు రైల్వే చక్రబంధం నుంచి విముక్తి కల్పించడానికి కృషి చేస్తానని తెలిపారు. కంచె చేను మేస్తోందన్నట్లు కాంగ్రెస్‌ ప్రభుత్వం పనిచేస్తుందని, కష్టపడి కట్టుకున్న పేదవారి ఇళ్లను కూల్చేశారని, తమ తాత జాగీరులా అధికారులు ప్రవర్తిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వర్షాకాలంలో జీహెచ్‌ఎంసీ ఏ మాత్రం బాధ్యత తీసుకోవడం లేదని విమర్శించారు. చెరువుల్లో గుర్రపుడెక్క పెరుగుతోందని, కార్పొరేటర్ల నుంచి జీహెచ్‌ఎంసీ మేయర్‌ వరకూ అందరు బాధ్యతగా పని చేయాలన్నారు. అనంతరం ఆయనకు ఆశా వర్కర్లు తమ సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు శ్రావణ్‌, రాజ్యలక్ష్మి, డీఎస్‌.మల్లారెడ్డి, ఆర్కే శ్రీను, మధుసూదన్‌రెడ్డి, వెంకటేష్‌, వాసంశెట్టి శ్రీనివాస్‌, స్వర్ణలత, భానుప్రసాద్‌, బాల్‌లింగం, మహేష్‌, శ్రీనివాస్‌ముదిరాజ్‌, నరహరి, తేజ, గణేష్‌ ముదిరాజ్‌ తదితరులు పాల్గొన్నారు.

చౌకబారు రాజకీయాలు సరికాదు



మల్కాజిగిరి డివిజన్‌ కార్పొరేటర్‌ శ్రవణ్‌

మల్కాజిగిరి: ప్రజా సమస్యలపై తాను చేస్తున్న నిరసనలు, ఉద్యమాన్ని కించపరుస్తూ సామాజిక మీడియాలో చేస్తున్న చౌకబారు రాజకీయాలు వద్దని మల్కాజిగిరి డివిజన్‌ కార్పొరేటర్‌ శ్రవణ్‌ హితవుపలికారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. ఇటీవల జరిగిన ప్రెస్‌మీట్‌లో తన పేరు ప్రస్తావిస్తూ మాట్లాడమే కాకుండా కౌన్సిల్‌ సమావేశానికి మల్కాజిగిరిలోని సఫిల్‌గూడ చెరువులో పేరుకుపోయిన గుర్రపు డెక్కను తీసుకెళ్లి నిరసన చేశానని, దాని మీద సోషల్‌ మీడియాలో వ్యంగంగా ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్‌ నాయకులకు సమస్యల పరిష్కారంపై చిత్తశుద్ధి లేదన్నారు. మూడు సంవత్సరాలుగా ప్రొటోకాల్‌ విస్మరించిన విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. ఆర్‌కేనగర్‌లో రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయిస్తే దానిని నిలిపివేసింది ఎవరని ఆయన ప్రశ్నించారు. పనులు నిలిపివేసినప్పుడు మున్సిపల్‌ అధికారులను ప్రశ్నిస్తే వారి చేత కేసులు పెట్టించిన విషయం వాస్తవం కాదా? అని అన్నారు. ఇకనైనా వారిలో మార్పు రాకుంటే ప్రజలే బుద్ధి చెప్తారన్నారు. చేతనైతే సమస్యలను ఆ పార్టీ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. పోరాటం చేస్తున్న వారిని హేళన చేయడం దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమన్నారు.

ఉప్పల్‌ భగాయత్‌ సమస్యలు పరిష్కరించాలి



ఆమ్రపాలికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి తదితరులు

ఉప్పల్‌: ఉప్పల్‌ భగాయత్‌ లే అవుట్‌లోని సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కోరారు. సోమవారం భగాయత్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు మేకల మధుసూదన్‌ రెడ్డి, బీఆర్‌ఎస్‌ నేత గంధం నాగేశ్వర్‌రావుతో కలిసి జీహెచ్‌ఎంసీ కమిషనర్‌ ఆమ్రపాలికి వినతిపత్రం అందజేశారు. వాటిలో సౌకర్యాలు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

శుభాకాంక్షలు తెలిపిన నేతలు



మెట్టు సాయి కుమార్‌ గంగపుత్రకు శుభాకాంక్షలు తెలుపుతున్న కుంట హరిశంకర్‌

గౌతంనగర్‌: తెలంగాణ మత్స్య సహకార సంఘాల ఫెడరేషన్‌ చైర్మన్‌ మెట్టు సాయికుమార్‌కు సోమవారం పలువురు శుభాకాంక్షలు తెలిపారు. మల్కాజిగిరి సర్కిల్‌ మల్లికార్జునగర్‌కు చెందిన టీపీసీసీ కార్యదర్శి కుంట హరిశంకర్‌ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ సంఘం కార్యవర్గం ఎన్నిక

కాప్రా: కాప్రా పద్మశాలి టౌన్‌షిప్‌ శ్రీభావన ఋషి నివాసితుల సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం బ్యాలెట్‌ విధానం ద్వారా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా మాతూరు నరేందర్‌రెడ్డి తన ప్రత్యర్థి ఎం.కిషోర్‌పై 20 ఓట్ల మెజార్టీతో గెలుపొందాడు. అదేవిధంగా ప్రధాన కార్యదర్శిగా నామాల సుగుణేష్‌, ఉపాధ్యక్షులుగా క్లెం రాము, కోశాధికారిగా సదానంద్‌గౌడ్‌, సంయుక్త కార్యదర్శిగా భరత్‌రాజ్‌, కార్యవర్గ సభ్యులుగా లత, ప్రసన్నకుమారి, పరమేష్‌, దీపలను ఎన్నుకున్నారు.



ఎన్నికైన సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం

మురుగు పారుతున్నా పట్టించుకోరా?



అల్వాల్‌: మురుగునీరు ఏరులై పారుతున్న పట్టించుకునేవారు కరువయ్యారు. మచ్చ బొల్లారం డివిజన్‌లోని మార్కెట్‌ రోడ్డులో కొన్ని రోజులుగా మురుగునీరు రోడ్డు మీద పారుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. నిత్యం వందలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. వ్యాపారాలు చేసుకునే వారు సైతం మురుగు నీటితో ఇబ్బందులు పడుతున్నారు. పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించు కోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన సంబంధిత అధికారులు స్పందించాలని స్థానికులు డిమాండ్‌ చేస్తున్నారు.

ఇంటి తాళం పగలగొట్టి చోరీ

అల్వాల్‌: ఇంటి తాళం పగలగొట్టి దొంగతనానికి పాల్పడిన సంఘటన నేరేడ్‌మెట్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. చంద్రపురి కాలనీలో నివసించే బి.శంకర్‌ రైల్వే ఉద్యోగి. కొన్ని కారణాల వల్ల రెండు నెలల క్రితం మరో ప్రాంతానికి నివాసం మార్చాడు. చంద్రపురి కాలనీలోని నివాసంలో సామాను అలాగే ఉంది. తరచూ వచ్చి వెళ్తుండేవాడు. సోమవారం ఇంటికి వచ్చేసరికి తాళం పగలగొట్టి ఉంది. బీరువాలో దాచిన 13 తులాల బంగారు నగలు చోరీ జరిగిందని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధుడి అదృశ్యం



సత్యనారాయణ

కుషాయిగూడ: ఇంటి నుంచి వెళ్లిన ఓ వృద్ధుడు అదృశ్యమయ్యాడు. ఈ ఘటన సోమవారం కుషాయిగూడ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. కుషాయిగూడకు చెందిన సార సత్యనారాయణ (75) సోమవారం ఉదయం 11 గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. కుమారుడు సార శ్రీనివాస్‌ కుషాయిగూడ పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నేడు విద్యుత్‌ సరఫరాలో అంతరాయం

ఉప్పల్‌: జాతీయ రహదారిలో విద్యుత్‌ స్తంభాల మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్‌ సరఫరాలో అంతరాయం ఉంటుందని సోమవారం ఏఈ నిఖిల్‌ తెలిపారు. ఉప్పల్‌ కూరగాయల మార్కెట్‌, ఉప్పల్‌ మెయిన్‌ రోడ్డు, గాంధీనగర్‌ తదితర ప్రాంతాల్లో, అదేవిధంగా ఉప్పల్‌ శాంతినగర్‌ 11 కేవీ ఫీడర్‌ మరమ్మతుల కారణంగా ఉప్పల్‌ – వరంగల్‌ జాతీయ రహదారి, విజయపురి కాలనీ, ర్యాంకర్‌ స్కూల్‌, బాలాజీ వెల్ఫేర్‌ అసోసియేషన్‌, ఏషియన్‌ థియేటర్‌ వెనుక కాలనీ తదితర ప్రాంతాల్లో విద్యుత్‌ సరఫరాకు అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

సమష్టిగా పోరాడాలి

అల్వాల్‌: సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ ఉద్యమకారులందరూ సమష్టిగా పోరాడాల్సిన అవసరం ఉందని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం చైర్మన్‌ చీమ శ్రీనివాస్‌ అన్నారు. అల్వాల్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన తెలంగాణ ఉద్యమకారుల సంఘం కార్యాలయాన్ని సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో పి. సురేందర్‌రెడ్డి, వెంకటస్వామి, జ్యోతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఎస్‌ఐలు

కుషాయిగూడ: కుషాయిగూడ పోలీస్‌స్టేషన్‌కు బదిలీపై వచ్చిన ఎస్‌ఐలు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఎస్‌.సుధాకర్‌రెడ్డి, బి.శ్రీనివాస్‌, ఆర్‌.రాములు, సీహెచ్‌ సాయిలు, సునీల్‌రెడ్డి విధుల్లో చేరారు. శాంతిభద్రతల పరిరక్షణకు తమ వంతు కృషి చేస్తామన్నారు.

జ్యోతికి మాదిగ ఉద్యమ వీరుల అవార్డు ప్రదానం



కుషాయిగూడ: మీర్‌పేట్‌–హెచ్‌బీకాలనీ డివిజన్‌, కైలాసగిరికి చెందిన బొల్లం జ్యోతి మాదిగ ఉద్యమ వీరుల అవార్డు అందుకున్నారు. రవీంద్ర భారతిలో జరిగిన మాదిగ దండోర సదస్సులో ఎమ్మార్పీఎస్‌ రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపయ్య, గౌరవ అధ్యక్షుడు సంద్రపల్లి వెంకటయ్య చేతుల మీదుగా ఆమె అవార్డును స్వీకరించారు. మాదిగ హక్కుల కోసం పోరాటం చేసినందుకు గుర్తింపుగా ఈ అవార్డును ప్రదానం చేసినట్లు ఆమె తెలిపారు.

మహిళా సంఘాల ప్రతినిధులపై కేసు నమోదు

అల్వాల్‌: పోలీస్‌ కేసుల్లో రాజీ చేస్తామంటూ తలదూరుస్తూ బెదిరింపులకు పాల్పడుతున్న మహిళా సంఘాల ప్రతినిధులపై అల్వాల్‌ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. అల్వాల్‌కు చెందిన మహిళా సంఘాల ప్రతినిధులు నవ్య (32), భబిత (45), జ్యోతి (36) కొంతకాలం నుంచి పోలీస్‌ స్టేషన్‌కు వచ్చేవారిని ఆశ్రయిస్తూ రాజీ చేస్తామంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారు. ఇటీవల ఓ కేసులో పోలీసులను సైతం బెదిరించడంతో ముగ్గురిపై కేసు నమోదు చేశారు. వీరితో పాటు మరికొందరు ఇలాంటి ప్రయత్నాలు చేస్తున్నారని, వారిపై కూడా కేసులు నమోదు చేస్తామని సీఐ రాహుల్‌దేవ్‌ తెలిపారు.

‘ప్రజావాణి’కి ఫిర్యాదుల వెల్లువ



ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్‌

అల్వాల్‌: సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని పలువురు కాలనీ వాసులు అల్వాల్‌ సర్కిల్‌ ఉప కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. సర్కిల్‌ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో సమస్యలపై వివిధ కాలనీల ప్రజలు ఫిర్యాదు చేశారు. మచ్చబొల్లారం డివిజన్‌ కాలనీల జేఏసీ చైర్మన్‌ మన్మథరెడ్డి ఆధ్వర్యంలో ఉప కమిషనర్‌ శ్రీనివాస్‌రెడ్డికి సమస్యలపై వినతిపత్రం అందజేశారు. కాశిపురంలోని ప్రభుత్వ భూమిని(పార్కు) భూ కబ్జాదారులు రిజిస్ట్రేషన్‌ చేసుకునే యత్నం చేస్తున్నారని, రిజిస్ట్రేషన్‌ కాకుండా బ్లాక్‌ లిస్టులో పెట్టాలని కోరారు. సాంట్‌ మైకేల్‌ స్కూల్‌ వద్ద స్కూల్‌ పిల్లలు, వారి తల్లిదండ్రులు ఒకేసారి జమ కావడంతో ట్రాఫిక్‌ సమస్య ఏర్పడుతుందని, ఇబ్బందులు కలగకుండా చూడాలని వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వివిధ కాలనీల ప్రతినిధులు సంతోష్‌రెడ్డి, నవీన్‌కుమార్‌, బుచ్చిరెడ్డి, మోహన్‌రావు, తిరుపతిరెడ్డి, విష్ణు, రెహమాన్‌, రమేష్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను సత్వరమే పరిష్కరిస్తాం

బోడుప్పల్‌: బోడుప్పల్‌ నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 12 ఫిర్యాదులు అందాయని కమిషనర్‌ రాంలింగం తెలిపారు. టౌన్‌ ప్లానింగ్‌ విభాగం 7, ఇంజినీరింగ్‌ విభాగం 3, శానిటేషన్‌ విభాగం నుంచి 2 ఫిర్యాదులు అందాయి. వాటి పరిష్కారం కోసం సత్వరమే చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో వివిధ విభాగాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

రాజీవ్‌గాంధీ విగ్రహ ఏర్పాటుకు స్థల పరిశీలన



విగ్రహ ఏర్పాటుకు సంబంధించిన చిత్రపటాన్ని చూపిస్తున్న హనుమంతరావు, ఇతర నేతలు

ఉప్పల్‌: ఉప్పల్‌ రాజీవ్‌ గాంధీ అంతర్జాతీయ క్రికెట్‌ స్టేడియం ప్రాంగణంలో దివంగత మాజీ ప్రధాని రాజీవ్‌ గాంధీ విగ్రహ ఏర్పాటుకు మాజీ పీసీసీ అధ్యక్షులు వి. హనుమంతరావు సోమవారం కాంగ్రెస్‌ నేతలతో కలిసి స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. త్వరలోనే విగ్రహ ఏర్పాటు పనులను పూర్తి చేసి రాజీవ్‌గాంధీ జయంతి రోజు ఆగస్టు 20న విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌సీఏ సెక్రెటరీ దేవరాజ్‌, కోశాధికారి సీజే శ్రీనివాస్‌, సభ్యులు భాస్కర్‌, విగ్రహ రూపకర్త రాజు ఒడియర్‌, కాంగ్రెస్‌ ఉప్పల్‌ నియోజకవర్గ ఇన్‌చార్జి మందుముల పరమేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మ దహనం



రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

ఉప్పల్‌: హిందువుల మనోభావాలను దెబ్బతీసే విధంగా కాంగ్రెస్‌ పార్టీ అగ్రనేత రాహుల్‌ గాంధీ పార్లమెంట్‌లో చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ సోమవారం బీజేవైఎం ఆధ్వర్యంలో చిలుకానగర్‌ చౌరస్తాలో ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా బీజేవైఎం రాష్ట్ర నాయకుడు సందీప్‌ యాదవ్‌ మాట్లాడుతూ..రాహుల్‌ గాంధీ ఇప్పటికైన తన ప్రవర్తనను మార్చుకోవాలని, లేకుంటే గుణపాఠం తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో డివిజన్‌ అధ్యక్షుడు దప్పు దత్త సాయి, నాయకులు శ్రీకాంత్‌, అంజయ్య, భరత్‌రెడ్డి, రాము యాదవ్‌, అజయ్‌గుప్తా, తిరుపతి, సత్య నారాయణ, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యాజ్యోతి పాఠశాలలో గ్రీన్‌ డే



గ్రీన్‌ డే వేడుకలో పాల్గొన్న విద్యార్థులు

బోడుప్పల్‌: చెంగిచర్లలోని విద్యాజ్యోతి ఉన్నత పాఠశాలలో సోమవారం గ్రీన్‌ డే వేడుకలను నిర్వహించారు. నేటి సమాజంలో పిల్లలు చేయకూడని, చేయాల్సిన పనులను నాటక రూపంలో ప్రదర్శించారు. వివిధ అంశాలపై ప్రసంగించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు శ్రవణ్‌కుమార్‌రెడ్డి, అనిల్‌, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.